# "శ్రీమతి చేసిన చిన్న తమాషా"

పి. వి. యల్. నరసింహారావు

ప్రక్కగా పోతున్న ప్లిమత్ కారు డ్రైవరు వేసిన సడన్ బ్రేక్‌తో 'బొంయ్' మంటూ శబ్దం చేసికొంటూ ఆగిపోయింది. ఆ దెబ్బతో పరధ్యానంగా నడుస్తూ వున్న ఆనందరావు ఆలోచనా ప్రవాహానికి కూడా సడన్ బ్రేక్ పడింది. వెంట్రుక వాసిలో తప్పిపోయింది పెద్ద ప్రమాదం. జనం అంతా గుమికూడారు. "ప్రతివారికీ వీధులలో నడుస్తూ కూడా పెద్ద వేదాంతుల లాగా ఆలోచించుకొంటూ నడవటమూ కారు ప్రమాదాలు జరుగుతున్నవి అని మమ్ములను కోర్టులకు యీడ్పించటం పరిపాటయిపోయింది" అంటూ డ్రైవరు తిరిగీ కారు నడుపించుకొని పోయాడు.

ఆనందరావు తిరిగీ నడక సాగించాడు. ఆలోచనా తరంగాలు క్రిందికీ పైకీ పొంగుతూనే వున్నాయి అతని మెదడులో. అంత తీవ్రంగా ఆలోచిస్తూ నడవటానికి కారణం లేక పోలేదు అతనికి. తనపేరు తలచుకొని చిరునవ్వు నవ్వుకొంటాడు తనలో తానే నేతిబీరకాయను గుర్తుకు తెచ్చుకొని. ఆనందరావు ప్రథమశ్రేణిలో ఎం. ఏ. పట్టం పుచ్చుకొన్న యువకుడు. అతడు పడినవన్నీ బాధలే. అతని విషాద గాథలు వేదనా శకలాలు. కాని, 'కావడికొయ్యే కుండలు మన్నే' అనే వేదాంతంలోకి దిగాడు-చివరకు.

కాని యీనాటికి ఆనందరావు పరిస్థితి వేరు. అతను వెళుతున్నది సర్వీసు కమిషను ఆఫీసుకు. కొన్ని దినాల క్రిందట అతను పదవ సారి కూర్చున్న కాంపిటేటివు పరీక్షల ఫలితాలు యివాళ తెలుస్తాయి ఆఫీసులో. ఆ ఫలితాలమీదనే ఆధారపడి వున్నది అతని జీవితం అంతా. అతడు అందులో నెగ్గితే గెజిటెడ్ ఆఫీసరు అయికూర్చుంటాడు ఒకేసారి. అందుకనే అంతగా ఆలోచిస్తూ నడుస్తూ వున్నది. ఇప్పుడు అతని మెదడులో జరుగుతున్నది యీ సంగ్రామమే. ఆలోచనలు ఒకదానివెంట ఒకటి పరుగిడుతున్నయి పాదరసం లాగా. మిగిలిన ఒకే ఒక చార్మినార్ సిగరెట్టును బైటికి తీసి ముట్టించాడు. ఒకవేళ ఆఫీసరు అయిపోతే తన శ్రీమతి యెంత ఆనందిస్తుందో. పాపం తనకోసం యెన్ని కష్టాలు పడుతున్నది యిప్పుడు. అప్పుడు తను యెంత గారంగా చూచుకొంటాడో.

ముద్దులు మూటగట్టే మూడేండ్ల బాబు! బాబుకు తను సైకిలు, గుర్రం యెన్ని కొంటాడో! నిజంగా తనకా అంత అదృష్టం! ఇది రాకపోతే వేసిన చోటనే వున్న గొంగళే అతని పని. ప్రతి వుదయమూ తనకు మేలుకొలుపులు చెప్పే వైతాళికులు — పాలమనిషి, అంగడివాడు, గృహ యజమాని చాకలి. వగైరాలు. తనూ. ఆ జీవితానికి అంతు వుండదు. ఇలా ఆలోచిస్తూ సర్వీసు కమిషను ఆఫీసులోకి చిరిగిన చొక్కా భాగం పైకి అగుపించకుండా పాంటులోకి దోపుకొంటూ అడుగెట్టాడు ఆనందరావు. ఆనందరావు ఆనందానికి అంతులేదు. తన కండ్లను తను నమ్మలేకపోయాడు. ఏకంగానే ఆఫీసరు అయిపోయాడు. మనసు మనో వాయు వేగాలను అధిగమించింది శ్రీమతి యెంత సంతోషిస్తుందో. యింటికి పరుగులెత్తాడు ఆనందరావు.

ఆనందరావు ఆశ్చర్యానికి అంతులేదు యింటికి వచ్చేటప్పటికి సీతాకోక చిలుకలా తయారయిన శ్రీమతి కలకలలాడుతూ కిలకిల నవ్వుతూ ఆహ్వానించింది. ఎలా తెలిసిందో యీశుభవార్త శ్రీమతికి తనకు వున్న ఒకే ఒక జార్జెటు చీరె తీసి శృంగారించుకొన్నది. ఎవరి నోటా యేమాటా పలకలేదు. భోజనానికి లెమ్మన్న శ్రీమతి మాట విని నివ్వెరపోతున్న ఆనందరావు కాళ్లు కడుక్కొని వచ్చి పీటమీద కూర్చొన్నాడు. విందును చూచి వింతపడ్డాడు. ఇదివరకు వాసనలు ఆఘ్రాణించి తృప్తిని చెందిన ఆనందరావు లడ్డూ, ఆవడ, పులిహోరలతో విందు ముగించాడు. భోజనానంతరము శ్రీమతి తాంబూలముతోపాటు మడతపెట్టిన ఒక కాగితం ముక్క యిచ్చింది. అందులో "విజయంలో వేంచేసిన శ్రీవారికి—బహుమతి" అని వ్రాసివుంది. రానురాను అగమ్యమయిపోయింది అతని స్థితి. ఆ పరీక్షలో నెగ్గిన ఆనందరావు యీ పరీక్షలో తప్పిపోయాడు.

మత్తు యెక్కిపోయివున్న ఆనందరావు శ్రీమతి ఒక చిన్న కాగితం మడతపెట్టి మూలగా విసిరివేయటం చూసి చూడనట్లే నటించాడు. బాబును యెత్తుకొని శ్రీమతి పైకి వెళ్లింది. పిల్లిలాగా అడుగులు వేసుకొంటూ వెళ్ళి ఆ కాగితంముక్క మడతలను విప్పి చూచాడు అందులో. "రాకపోతేపోయింది. పదవపర్యాయం, దీనితోటయింకొకటవస్తుంది. దిగులుపడకండి' అని వ్రాసి వున్నది.

ఆనందరావుకు అర్థం అయింది శ్రీమతి చేసిన తమాషా. హుషారుగా పాడుకొంటూ మత్తు యెక్కిన ఆనందరావును చూచి పకపక నవ్వింది శ్రీమతి. "అమ్మదొంగా, తెలిసిందిలే నీ నాటకం" అంటూ శ్రీమతి ముద్దాడుతున్న బాబును పోటీగా తనుకూడా రెండుసార్లు ప్రయత్నించాడు. కొంటె బాబు [illegible] పెదవులు కలిసాయి. ఉన్న ఒకే ఒక జార్జెటు చీర నలిగి పోతుందని శ్రీమతి పెట్టుకొన్న మొర వృథా కానే అయింది. ★

